ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 3 | సంచిక: 16 | పేజీలు: 4 | వెల: రూ.3/- | సోమవారం 28 ఏప్రిల్ 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

# తెలంగాణకు విలన్ నంబర్-1 కాంగ్రెస్సే: కేసీఆర్



**హనుమకొండ: ఏప్రిల్ 27 (ప్రభాత ఉదయం):** తెలంగాణ రాష్ట్రానికి కాంగ్రెస్ పార్టీ విలన్ నంబర్ 1 అని భారాస అధినేత కేసీఆర్ అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి కాంగ్రెస్ పార్టీ విలన్ నంబర్ 1 అని భారాస అధినేత కేసీఆర్ అన్నారు. 1956లో బలవంతంగా ఆంధ్రతో కలిపింది జవహర్‌లాల్ నెహ్రూ అయితే, 1969లో తెలంగాణ ఉద్యమం వస్తే.. మళ్లీ కాంగ్రెస్ పార్టీ నిరంకుశంగా అణచివేసిందని విమర్శించారు. అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడైనా తెలంగాణకు మొదటి విలన్ కాంగ్రెస్ పార్టీయేనని వ్యాఖ్యానించారు. భారాస రజతోత్సవ వేడుకల సందర్భంగా హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో కేసీఆర్ పాల్గొన్నారు. తొలుత జమ్ముకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపంగా నిమిషం పాటు మౌనం పాటించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ... వలసవాదుల విషకౌగిలిలో నలిగిపోతున్న నా భూమికి విముక్తి కల్పించాలనే లక్ష్యంతో ఒక్కడినే బయల్దేరానని అన్నారు. ప్రత్యేక తెలంగాణ కోసం బయల్దేరిన సమయంలో కొందరు వెటకారం చేశారని, అన్నింటినీ అధిగమించి పోరాడి తెలంగాణను సాధించానని చెప్పారు. ప్రజలు దీవిస్తే పదేళ్లపాటు ధగధగలాడే తెలంగాణను తయారు చేసుకున్నామన్నారు. “1969లో మూగబోయిన తెలంగాణ ఉద్యమానికి మళ్లీ జీవం పోశాను. కొండా లక్ష్మణ్ బాపూజీ నివాసమైన జలదృశ్యం వేదికగా తెరాస ఆవిర్భావం జరిగింది. ఉద్యమ జెండాను దించితే నన్ను రాళ్లతో కొట్టి చంపమని ఆనాడు చెప్పాను. 60 ఏళ్ల సమైక్య పాలనలో తెలంగాణ ప్రజలు ఎన్ని బాధలు పడ్డారో నాకు తెలుసు. ఆనాడు కాంగ్రెస్, తెదేపాలో ఉన్న నేతలు పదవుల కోసం పెదాలు మూసుకొని కూర్చున్నారు. శాసనసభలో తెలంగాణ అనే పదమే ఉపయోగించవద్దని రూలింగ్ ఇచ్చారు. తెరాస ఏర్పాటు తర్వాత మలిదశ ఉద్యమం ఉద్ధృతమైంది. సాగరహారం, వంటావార్పు, సకలజనుల సమ్మె వంటి కార్యక్రమాలతో ఉద్యమాన్ని ఉద్ధృతం చేశాం”

“సాధించుకున్న తెలంగాణలో ప్రజలు దీవించి పదేళ్లపాటు అవకాశమిస్తే.. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాం. ప్రాజెక్టులు నిర్మించి సాగుభూమిని గణనీయంగా పెంచాం. మూడేళ్లలోనే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించాం. అద్భుతమైన తెలంగాణను నిర్మించుకున్నాం. పంజాబ్‌ను తలదన్నేలా పంటలు పండే రాష్ట్రాన్ని నిర్మించుకున్నాం. షేర్‌షా కాలం నుంచి స్వాతంత్ర్యం వచ్చే వరకు రైతుల నుంచి ఎన్నో పన్నులు వసూలు చేశారు. వారి నుంచి పన్నులు వసూలు చేసిన వారే తప్ప.. వారికి మేలు చేసిన వాళ్లు లేరు. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే పట్టించుకున్న నాథుడు లేడు”

ఎన్నోన్నో పథకాలు అమలు చేశాం



“రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు రైతుబంధు పథకం తీసుకొచ్చాను. రైతుబీమా అమలు చేసి రైతు కుటుంబాలను ఆదుకున్నాం. భారాస హయాంలో రైతుబంధు పథకం నిరాటంకంగా అమలైంది. వానాకాలం, యాసంగి పంటలకు సకాలంలో రైతుబంధు జమచేశాం. ఎన్నికల అజెండాలో చెప్పని ఎన్నో పథకాలను అమలు చేశాం. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, కల్యాణలక్ష్మి, చేపల పెంపకం వంటివి అమలు చేశాం. రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించి ఉద్యోగ అవకాశాలు పెరిగేలా చేశాం. రాష్ట్రంలో 3 మాత్రమే ఉన్న వైద్య కళాశాలల సంఖ్యను 33కి పెంచాం”

తెలంగాణకు ఏం బీమారి వచ్చింది?

“ఎన్నో అద్భుతాలు సాధించుకున్న తెలంగాణకు ఇవాళ ఏం బీమారి వచ్చింది. కాంగ్రెస్ నేతలు ఎన్నికల ముందు ఎన్నెన్నో చెప్పారు. దిల్లీ నుంచి వచ్చిన నకిలీ గాంధీలు ఎన్నో హామీలిచ్చారు. పింఛను రూ.2 వేలు ఉంటే కాంగ్రెసోళ్లు రూ.4 వేలు వేస్తామన్నారు. మేం రైతుబంధు రూ.10వేలు ఇస్తే.. రూ.15 వేలు ఇస్తామని కాంగ్రెస్ చెప్పింది. చదువుకునే విద్యార్థినులకు స్కూటీలు ఇస్తామన్నారు. రూ.2 లక్షల రుణమాఫీని ఒక్క సంతకంతో రద్దు చేస్తామని చెప్పారు. కల్యాణలక్ష్మి పథకంలో రూ.లక్షతోపాటు తులం బంగారం ఇస్తామన్నారు. ఇప్పటికీ పింఛన్లు పెరగలేదు, రుణమాఫీ పూర్తి కాలేదు. ఎన్నో మాటలు చెప్పి ప్రజలను ఏమార్చారు”

“ఉచిత బస్సులు పెట్టి మహిళలు జుట్లు పట్టుకొని కొట్టుకునే పరిస్థితి తెచ్చారు. ప్రతి చెడు విషయానికి కేసీఆర్ కారణమని చెబుతున్నారు. మమ్మల్ని ఎవరూ నమ్మడం లేదు.. అప్పు పుడతలేదని దివాలా మాటలు మాట్లాడుతున్నారు. హామీల గురించి అడిగితే.. సంక్రాంతి, మార్చి అంటూ గడువులు చెబుతున్నారు. నా కళ్లముందే తెలంగాణ ఇలా అయిపోతుంటే దుఃఖం వస్తోంది. మళ్లీ కరెంట్ కోతలు, మోటార్లు కాలిపోయే రోజులు వచ్చాయి. కేసీఆర్ మంచిగా ఇచ్చిన కరెంట్‌కు ఇవాళ ఏమయిందని అడుగుతున్నాం. భూముల ధరలు ఎందుకు తగ్గాయి? నీళ్లు ఎక్కడికి పోయాయి? వడ్లు కొనే దిక్కులేదు.. కల్లాల్లో రైతులు ఏడుస్తున్నారు. 2014కు ముందున్న పరిస్థితులు మళ్లీ వచ్చాయి” భారాస అధినేత కేసీఆర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.





## తెలంగాణలో భారీగా ఐఏఎస్ అధికారుల బదిలీ

### ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

**హైదరాబాద్, ఏప్రిల్ 27 (ప్రభాత ఉదయం):** తెలంగాణలో భారీగా ఐఏఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు ఆదివారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావును ప్రభుత్వం నియమించింది. శాంతికుమారి ఈ నెల 30న పదవీ విరమణ చేయనుండడంతో ఆమె.. స్థానంలో రామకృష్ణారావుకు బాధ్యతలు అప్పగించింది. గుడ్ గవర్నెన్స్ వైస్ చైర్మన్‌గా శశాంక్ గోయల్‌ను నియమించింది. ఇండస్ట్రీ, ఇన్వెస్ట్‌మెంట్ సెల్ సీఈవోగా జయేశ్ రంజన్, పరిశ్రమలు, వాణిజ్యం ప్రత్యేక ముఖ్య కార్యదర్శిగా సంజయ్‌కుమార్‌కు బాధ్యతలు అప్పగించింది. ఫైనాన్స్ కమిషన్ మెంబర్ సెక్రెటరీగా స్మితా సబర్వాల్, కార్మికశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీగా దాన కిశోర్, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి (హెచ్ఎండీఏ వెలుపల) టీకే శ్రీదేవి, పట్టణాభివృద్ధిశాఖ కార్యదర్శిగా (హెచ్ఎండీఏ పరిధి) ఇలంబర్తి, జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఆర్వీ కర్ణన్‌ను నియమించింది. ఫ్యూచర్ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్‌గా కే శశాంక, జెన్‌కో సీఎండీగా ఎస్ హరీశ్, రాష్ట్ర మానవహక్కుల కమిషనర్ సెక్రటరీ-సీఈవోగా నిఖిల, ఆరోగ్యం-కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టర్‌గా సంగీత సత్యనారాయణ, దేవాదాయశాఖ డైరెక్టర్, యాదగిరిగుట్ట దేవస్థానం ఈవోగా ఎస్ వెంకటరావు, సెర్ప్ అదనపు సీఈవోగా పీ కాత్యాయనీదేవి, ఇండస్ట్రీ-ఇన్వెస్ట్‌మెంట్ సెల్ అదనపు సీఈవోగా ఈవీ నర్సింహారెడ్డికి బాధ్యతలు అప్పగించింది.

# నేను మాట ఇస్తున్నా.. న్యాయం జరుగుతుంది

### పహల్గామ్ దాడిపై ప్రధాని సంచలన వ్యాఖ్యలు
### ఉగ్రదాడిపై ఆగ్రహంతో రగిలిపోతున్న యావత్తు దేశం
### మన్ కీ బాత్‌లో మరోసారి మాట్లాడిన ప్రదాని మోదీ
### ప్రతి భారతీయుడి రక్తం మరిగిపోతుందన్న ప్రధాని



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 27 (ప్రభాత ఉదయం):** జమ్మూ కశ్మీర్‌లో గతవారం జరిగిన పహల్గామ్ ఉగ్రదాడిపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మరోసారి స్పందించారు. ‘మన్ కీ బాత్’ రేడియో కార్యక్రమంలో దేశాన్ని ఉద్దేశించి మోదీ మాట్లాడుతూ.. పహల్గామ్ దాడి ఉగ్రవాదుల అసహనానికి, పిరికితనానికి నిదర్శనమని పేర్కొన్నారు. ‘కశ్మీర్‌లో మళ్లీ శాంతి నెలకుంటోంది.. పాఠశాలలు, కళాశాలలు ఉల్లాసంగా ఉన్నాయి, గతంలో ఎన్నడూ లేనంత వేగంగా అభివృద్ధి పనులు జరిగాయి, ప్రజాస్వామ్యం బలపడుతోంది, పర్యాటకుల సంఖ్య రికార్డు స్థాయిలో పెరిగింది, ఆదాయాలు పెరుగుతున్నాయి, యువతకు కొత్త అవకాశాలు వచ్చాయి. ఈ అభివృద్ధిని దేశం, జమ్మూ కశ్మీర్ శత్రువులు భరించలేకపోయారు’ అని ప్రధాని చెప్పారు. ఏ రాష్ట్రం నుంచి వచ్చిన వారినైనా, ఏ భాష మాట్లాడే వారినైనా, ఏ భారతీయుడినైనా ఏప్రిల్ 22 నాటి ఉగ్రదాడి తీవ్రంగా కలచివేసిందని ప్రధాని అన్నారు. ‘ఉగ్రదాడి ఫోటోలను చూసిన ప్రతి భారతీయుడి రక్తం ఆగ్రహంతో మరిగిపోతోంది’ అని చెప్పారు. ప్రపంచం మొత్తం భారత్‌తో ఉందని ప్రధాని పేర్కొన్నారు. ‘బాధిత కుటుంబాలకు న్యాయం జరుగుతుందని నేను హామీ ఇస్తున్నాను. ఈ దాడి వెనుక ఉన్నవారు కఠినమైన శిక్ష అనుభవించక తప్పదు... ఉగ్రవాదులు, వారి మాస్టర్లు కశ్మీర్‌ను నాశనం చేయాలనే కుట్రను పన్నారు’ అని పేర్కొన్నారు.



## దక్షిణాదిలో కూడా బీజేపీ జెండా ఎగరేస్తాం!

**హైదరాబాద్, ఏప్రిల్ 27 (ప్రభాత ఉదయం):** దక్షిణాది ప్రజలకు మేలు చేస్తాం అని, ప్రజల హృదయాలలో చోటు సంపాదించి ఇక్కడ కూడా జెండా ఎగరేస్తాం అని కేంద్రమంత్రి కమ్ తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి అన్నారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా తెలంగాణ, కర్ణాటక, తమిళనాడులలో అధికారంలోకి వస్తామన్నారు. దక్షిణ భారతదేశానికి ప్రధాని మోడీ నేతృత్వంలో ఎలాంటి అన్యాయం జరగదన్నారు. ప్రధాని మోడీ పేద కుటుంబం నుంచి వచ్చారని.. పేద ప్రజల గుండె చప్పుడు ఆయనకు తెలుస్తుందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. మన్ కీ బాత్ పూర్తయిన అనంతరం మేధావుల సదస్సు ప్రారభమైంది. ఈ సదస్సులో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్ పాల్గొన్నారు.

## తెలంగాణ కొత్త సీఎస్‌గా కె. రామకృష్ణారావు



**హైదరాబాద్, ఏప్రిల్ 27 (ప్రభాత ఉదయం):** తెలంగాణ రాష్ట్ర కొత్త ఛీఫ్ సెక్రెటరీగా కె. రామకృష్ణారావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతమున్న సీఎస్ శాంతి కుమారి ఈ నెల 30న పదవీ విరమణ చేయనున్నారు. 1989 బ్యాచ్‌కు చెందిన ప్రస్తుత సీఎస్ శాంతికుమారి 2021 జనవరి నుంచి సీఎస్ గా వ్యవహరిస్తున్నారు.



## శ్రీకోటిలింగేశ్వరదత్తదేవస్థానములో రుద్రహోమం లలితా సహస్రనామ స్తోత్రపారాయణం

కొత్తకోట, ఏప్రిల్ 27 ( ప్రభాత ఉదయం) కొత్తకోట మండలం కానాయపల్లి స్టేజి దగ్గర గల సుప్రసిద్ధమైన శైవక్షేత్రం శ్రీకోటిలింగేశ్వరదత్తదేవస్థానము దగ్గర అమావాస్య సందర్భంగా నూతనంగా నిర్మించిన ధ్యానమందిరంలో లోకకళ్యానార్థం రుద్రహోమం మరియు లలితా సహస్రనామ స్తోత్రపారాయణం వైభవంగా జరిగింది. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని లలితా సహస్రనామ స్తోత్రపారాయణం చేయగా అర్చకులు వేదమంత్రాలతో హోమక్రతువు పూర్తి చేసి పూర్ణాహుతి సమర్పించి కూష్మాండ బలి ఇచ్చారు. అనంతరం భక్తులకు ఆలయకమిటీ అన్నదానం చేశారు.



## కరాటేతో శారీరక దారుఢ్యం, ఆత్మస్థైర్యం

### కార్పొరేటర్ శ్రీనివాసరావు

### కరాటే బెల్టు గ్రేడింగ్ టెస్ట్ లో ప్రతిభ చాటిన కొత్తకోట విద్యార్థులు


కొత్తకోట, ఏప్రిల్ 27 ( ప్రభాత ఉదయం) కొత్తకోట పట్టణానికి చెందిన విద్యార్థులు కరాటే బెల్టు గ్రేడింగ్ పరీక్షలో ప్రతిభ చాటారు.ఆదివారం హైదరాబాద్ మహానగరంలోని కూకట్పల్లి 4 పేస్ లోని కమ్యూనిటీ హాల్లో గాడ్స్ ఆన్ వారియర్స్ షోతో ఖాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో మాస్టర్ పృథ్వీరాజ్ విద్యార్థి విద్యార్థులకు బెల్టు గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చీఫ్ ఎగ్జాం నియర్ గా క్లబ్ ఫౌండర్ అబ్దుల్ నబీ నిర్వహించారు. ఈ పరీక్షలో సుమారు 25 మంది విద్యార్థి విద్యార్థులు పాల్గొని చక్కటి ప్రతిభ కనబరిచి వివిధ విభాగాలలో నైపుణ్యం కనపర్చారు. ఈ కార్యక్రమంలో కూకట్పల్లి కార్పొరేటర్ శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని అర్హత సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్ లు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేట్ శ్రీనివాస రావువిద్యార్థులకు ఇంత మంచి శిక్షణ ఇచ్చినందుకు మాస్టర్ పృథ్వీరాజ్ ని వారు శాల్వాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ...విద్యార్థులు చిన్నవయసులోనే కరాటే నేర్చుకోవడం ద్వారా శారీరకంగా మానసికంగా ఆత్మస్థైర్యం ఉంటుందని విద్యార్థులు చురుగ్గా ఉంటారని కరాటే స్పోర్ట్స్ లో మంచి అవకాశాలు వస్తాయన్నారు. తల్లిదండ్రులు విద్యార్థి విద్యార్థులకు ప్రోత్సహిస్తూ వారిని ఈ వేసవిలో విద్యార్థినీ విద్యార్థులకు కచ్చితంగా ప్రోత్సహించా లన్నారు. ఈ సందర్భంగా అర్హత సాధించిన విద్యార్థి విద్యార్థులకు వారు బెల్టు సర్టిఫికెట్ అందజేశారు.



ట్యాంక్ బండ్ పై గల కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద మాజీ మంత్రి కేటీఆర్ తో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి

## అమరవీరుల స్థూపం కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి నివాళు లర్పించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ రెడ్డి

షాద్ నగర్,ఏప్రిల్ 27(ప్రభాత ఉదయం):బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వరంగల్ లోని ఎల్కతుర్తిలో జరగబోయే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు వెళ్తున్న సందర్భంగా గన్ పార్కులోని తెలంగాణ అమరవీరుల స్థూపం ట్యాంక్ బండ్ లో ఉన్న ఆచార్య శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి నివాళులర్పించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్,మాజీ మంత్రులు,ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ రెడ్డి,పార్టీ నాయకులు తదితరులు నివాళులర్పించి వరంగల్ కి బయలుదేరారు.



న్యాయమూర్తికి ఆలయ చరిత్ర పుస్తకం అందజేస్తున్న ధర్మకర్త పట్వారి అరవిందరావు

## మల్దకల్ శ్రీ తిమ్మప్ప స్వామి దేవాలయం దర్శించుకున్న జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్

గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 27 (ప్రభాత ఉదయం) గద్వాల జిల్లాలోని మల్దకల్ మండల కేంద్రంలో గల ఆదిశిల క్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని ఆదివారం గద్వాల ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వి శ్రీనివాస్ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికి దేవాలయంలో అర్చనలు నిర్వహించారు. అనంతరం స్వామివారి శేష వస్త్రం చరిత్ర పుస్తకాన్ని న్యాయమూర్తికి అందజేశారు. ఈ సందర్భంగా దేవాలయ చరిత్రను అర్చకులు వారికి వివరించారు. కూకట్పల్లి నుండి జోగులాంబ గద్వాల జిల్లాకు బదిలీ అయిన ప్రధాన న్యాయమూర్తి మొదటిసారి దేవాలయానికి రావడం జరిగింది. ఈ కార్యక్రమంలో పట్వారి అరవిందరావు, సింగిల్ విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆలయాల్లో అమావాస్య పూజలు







గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 27 (ప్రభాత ఉదయం) జిల్లా వ్యాప్తంగా ఉన్న పలు ఆలయాల్లో అమావాస్య ప్రత్యేక పూజలు ఆదివారం ఘనంగా జరిగాయి. కేటిదొడ్డి మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో వెలసిన పాగుంటా శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయం, ధరూర్ మండలం పెద్ద చింతరేవుల శ్రీఆంజనేయ స్వామి ఆలయం , మల్దకల్ శ్రీస్వయంభూ లక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయం, బీచుపల్లి శ్రీఆంజనేయ స్వామి ఆలయం, తదితర ప్రసిద్ధ ఆలయాల్లో అమావాస్య సందర్భంగా స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. భక్తు లు అఖండ భజనలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కేటిదొడ్డి, ధరూర్ మండల కేంద్రంతో పాటు, పరిసర గ్రామాల ప్రజలు, కర్ణాటక ప్రజలు పాగుంట లక్ష్మీ వెంకటేశ్వర స్వామి, పెద్ద చింతరేవుల ఆంజనేయస్వామి స్వామి వార్లను దర్శించుకున్నారు. అనంతరం ఆలయాల్లో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

### కన్నుల పండువగా స్వామీ వారి కళ్యాణోత్సవం

కేటిదొడ్డి మండలం వెంకటాపురం గ్రామంలో వెలసిన పాగుంటా శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవం కన్నుల పండువగా కొనసాగింది. తెల్లవారుజాము నుంచే ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఉదయం ప్రాతఃకాల పూజలు, అభి షేకం, దీక్షా హోమం, శాంతిహోమం, పూర్ణాహుతి, చక్ర స్నానం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంత రం అలివేల మంగ సమేత లక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం మహామంగళ హారతి, మంత్రపుష్పం కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున తరలి వచ్చిన భక్తులు స్వామి వారి కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలతోపాటు అన్నదానం నిర్వహించారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు ఓ వరం: బండి రమేష్

### లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేసిన బండి రమేష్, వెంకటేశ్వరరావు

కూకట్పల్లి,ఏప్రిల్ 27 (ప్రభాత ఉదయం) నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఓ వరమని కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ అన్నారు. కూకట్ పల్లి నియోజకవర్గం లోని వివిధ డివిజన్ లకు సంబంధించిన ముఖ్యమంత్రి సహాయ నిధి కింద 17 మంది లబ్ధిదారులకు సుమారు 7లక్షల 20 వేల రూపాయల విలువ గల చెక్కులను కూకట్ పల్లి భాగ్యనగర్ కాలనీ లోని జీవీర్ కార్యాలయం వద్ద కూకట్ పల్లి నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్, కూకట్ పల్లి నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టుముక్కల వెంకటేశ్వర రావు లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి డివిజన్ అధ్యక్షులు మేకల రమేష్, గోవింద్ గౌడ్, వాసు, మల్లేష్ యాదవ్, రాజు యాదవ్, రమణ, నరేందర్, బండి సుధ, జ్యోతి మరియు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



వైద్యం కోసం ఎల్ఓసి అందజేస్తున్న కూకట్ పల్లి కాంగ్రెస్ ఇంచార్జ్ బండి రమేష్



పిడుగుపాటుకు మృతి చెందిన గేదలు, ఎద్దులు

## పిడుగుపాటుకు ఎద్దులు, గేదెలు మృతి

### తీవ్రంగా నష్టపోయిన రైతులు.. నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ప్రభుత్వానికి బాధితులు విజ్ఞప్తి

గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 27(ప్రభాత ఉదయం) గద్వాల జిల్లాలో పిడుగుపాటుకు రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఆదివారం ధరూర్ మండలం బీంపురంలో పిడుగుపాటుకు ఆంజనేయులు అనే రైతు ఆవు మృతి చెందడంతో కన్నీరు మున్నీరయ్యారు. అలాగే గార్లపాడు గ్రామంలో పాలెం నర్సింహులకు చెందిన రెండు కాడెద్దులు పిడుగుపాటుకు మృతి చెందాయని రైతులు తెలిపారు. ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేశారు.

## వరంగల్‌కు కదిలిన గులాబీ దండు

### గద్వాల ఇంచార్జి బాసు హన్మంతు నాయుడు ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో తరలి వెళ్ళిన గులాబీ శ్రేణులు 25 బస్సులు, 200 కార్లలో వరంగల్ సభకుకు వెళ్లిన పార్టీ కార్యకర్తలు, నాయకులు



వరంగల్ సభకు బయలుదేరిన గద్వాల జిల్లా బీఆర్ఎస్ శ్రేణులు

గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 27 (ప్రభాత ఉదయం)వరంగల్ లో నిర్వహిస్తున్న బీఆర్ ఎస్ పార్టీ రజతోత్సవ సభకు ఆదివారం జోగులాంబ గద్వాల జిల్లాలోని అన్ని గ్రామాల నుంచి గుళాబీదండు కదిలింది. ఈ సందర్భంగా అన్ని గ్రామాల నాయకులు జై తెలంగాణ.. జై కేసీఆ ర్ అని నినాదాలు చేసుకుంటూ కార్లలో, బస్సులు లో బయలు దేరి వెళ్లారు. గద్వాల బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి బాసు హన్మంతు నాయుడు ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు,నాయకులు, అభిమానులు వరంగల్ సభకు బారులు తీరారు. బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవల్లో భాగంగా వరంగల్ ఎల్కుర్తిలో నిర్వహిస్తున్న సభకు నియోజకవర్గం నుంచి వేలాది మంది కార్యకర్తలు తరలి వెళ్లారని బాసు హన్మంతునాయుడు పేర్కొన్నారు. 25 ప్రత్యేక బస్సుల్లో, 200 కార్లలో తోపాటు ఇతర వాహనాలలో గులాబీ శ్రేణులు సభకు వెళ్లారని చెప్పారు. ఊహించని స్థాయిలో స్వచ్ఛందంగా పార్టీ అభిమానులు, కెసిఆర్ అభిమానులు సభకు తరలిరావడం సంతోషకరమని అభిప్రాయపడ్డారు, ధరూర్, కేటిదొడ్డి గట్టు, మల్దకల్, గద్వాల మండలాలలోని ప్రతి పల్లె నుంచి కార్యకర్తలు సభకు తరలివచ్చారని, రజతోత్సవ సభ తెలంగాణ ప్రజల ఆత్మ గౌరవాన్ని మరోమారు నిలిపే విధంగా నిలుస్తుందని చెప్పారు. సభకు తరలి వెళ్లిన వారిలో అన్ని గ్రామాల కార్యకర్తలు,నాయకులు, అభిమానులు ఉన్నారు. అంతకు ముందు జిల్లా కేంద్రంలో ని ధరూర్ మెట్టు నుంచి గుళాబీదండు ర్యాలీ నిర్వహించారు. మహాత్మ గాంధీ, జ్యోతిరావుఫూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో తెలంగాణ తల్లి విగ్రహానికిపూల మాల వేసిననంతరం బీఆర్ఎస్ జెండను ఆవిష్కరించారు. తెలంగాణను సాధించిన అనంతరం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణను దేశంలోనే మొదటి స్థానంలో నిలిపారని, రాబోయే స్థానిక ఎన్నికలలో గ్రామంలో బీఆర్ ఎస్ జెండా ఎగరవేస్తామని ఈ సందర్భంగా బాసు హన్మంతునాయుడు అన్నారు



బీచుపల్లి ఆంజనేయ స్వామిని దర్శించుకున్న కొత్తకోట మండల కాంగ్రెస్ నాయకులు

## బీచ్‌పల్లి ఆంజనేయస్వామి ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి

### మాజీ సిడిసి చైర్మన్ మూలమల్ల చంద్రశేఖర్ రెడ్డి బీచుపల్లి ఆంజనేయ స్వామి ఆశీస్సులు తీసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కొత్తకోట, ఏప్రిల్ 27 ( ప్రభాత ఉదయం) బీచుపల్లి ఆంజనేయస్వామి ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ వనపర్తి జిల్లా అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి ఆకాంక్షించారు. ఆదివారం అమావాస్య పురస్కరించుకొని కొత్తకోట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కృష్ణ నది తీరాన వెలసిన బీచుపల్లి ఆంజనేయ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిసి మాజీ చైర్మన్ మూలమల్ల చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ... పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వెళుతుందని స్వామి వారి ఆశీస్సులతో అభివృద్ధి మరింత జరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సి డి సి మాజీ చైర్మన్ ఎం చంద్రశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ నాయకుడు రావుల,కర్ణాకర్ రెడ్డి, కానేపల్లి కాంగ్రెస్ పార్టీ నాయకుడు గోకరయ్య నాయుడు,ఎన్ ఎస్ యు ఐ నియోజకవర్గ అధ్యక్షుడు ఎండి ముస్తఫా, రవికుమార్ దర్శనం చేసుకున్నారు.

## కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలి

### సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బొబ్బిలి నిక్సన్.. కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలు ఉపసంహరించుకోవాలి

కొత్తకోట, ఏప్రిల్ 27(ప్రభాత ఉదయం) కేంద్రంలో మూడోసారి అధికారం కొచ్చిన బిజెపి నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం తన కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను కార్పొరేట్ అనుకూల దూకుడుగా అమలు చేస్తుందని సిఐటియు వనపర్తి జిల్లా ఉపాధ్యక్షులు బొబ్బిలి నిక్సన్ ఆరోపించారు. ఆదివారం కొత్తకోట పట్టణం లోని అంబా భవాని బిల్లింగ్ ఆధార్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించి ఏర్పాటు చేసిన సమావేశంలో బొబ్బిలి నిక్సన్ పాల్గొని మాట్లాడుతూ మే 20న,జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్మిక వర్గం సమరశీల పోరాటాల ద్వారా వంద సంవత్సరాలలో సాధించుకున్న 29,కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్స్ ను కేంద్ర ప్రభుత్వం ముందుకు తెచ్చిందని ఆయన ఆరోపించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులన్నిటిని తుంగలో తొక్కుతున్నాయని కార్మిక సంఘాల రద్దు చేసేందుకు బరితెగించి కార్మికుల హక్కులను కాల రాస్తుందని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బిల్డింగ్ అధర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షులు కే వెంకటయ్య, తెలంగాణ శ్రీను, ఆస్కాని శ్రీనివాసులు, కెవి ఆంజనేయులు, పి వెంకటేష్, డి ఆశన్న, పెద్ద వెంకటయ్య,చిన్న రాములు, పి జనార్ధన్,పి కురుమూర్తి, నరేష్,తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బొబ్బిలి నిక్సన్

# చైనాకు ధీటుగా భారత్‌లో వరి దిగుబడులను పెంచాలి

**ఐసీఏఆర్ పూర్వ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఆర్ఎస్ పరోడా**

**రాజేంద్రనగర్ లోని జాతీయ వరి పరిశోధన సంస్థలో గోల్డెన్ జూబ్లీ వరి వార్షిక గ్రూప్ మీటింగ్ ను ప్రారంభించిన ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎంఎల్ జాట్**



రాజేంద్రనగర్ లో వరి గోల్డెన్ జూబ్లీ గ్రూప్ మీటింగ్స్ ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న ఐ సీ ఏ ఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎం ఎల్ జాట్.




సదస్సులో మాట్లాడుతున్న ఐ సీ ఏ ఆర్ పూర్వ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఆర్ ఎస్ పరోడా

రాజేంద్రనగర్, ఏప్రిల్27(ప్రభాత ఉదయం) : చైనా లో వరి సగటు దిగుబడి 6 టన్నులు కాగా, భారతదేశంలో హెక్టారుకు 3.5 టన్నుల దిగుబడి మాత్రమే ఉందని, ఈ గ్యాప్ ను రకాలు, నిర్వహణ పద్ధతుల ద్వారా భర్తీ చేయాలని భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) పూర్వ డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాజేంద్రసింగ్ పరోడా అన్నారు. ఐసీఏఆర్ భాగస్వామ్యంతో రాజేం ద్రనగర్ లో కొనసాగుతున్న భారత వరి పరిశోధన సంస్థ (ఐఐఆర్ఆర్) లో మూడు రోజుల పాటు జాతీయ స్థాయిలో ఉన్న 500 మంది వరి పరిశోధకుల గోల్డెన్ జూబ్లీ గ్రూప్ మీటింగ్స్ ఆదివారం ప్రారంభమైనాయి. ఈ గోల్డెన్ జూబ్లీ గ్రూప్ మీటింగ్స్ను ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎం ఎల్ జాట్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ రాజేంద్రసింగ్ పరోడా మాట్లాడుతూ, పంజాబ్ రైతులు హైబ్రిడ్ వరి సాగును నిలిపివేశారని, అందుకు గల కారణాలను అన్వేషించి వాటి పరిష్కారానికి మార్గాలు చూపి పంజాబ్ లో హైబ్రిడ్ వరి సాగును పెంచే దిశగా కార్యచరణ తో ముందుకు సాగాలన్నారు. ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మంగిలాల్ జాట్ మాట్లాడుతూ, వినియోగ విధానం, వాతావరణ మార్పులు, క్షీణతను చాలా తీవ్రంగా పరిగణించాల్సిన అవసరం ఉందన్నారు. వరి రకాలు, సాంకేతికత, మార్కెట్ విధానం, సామాజిక, ఆర్థిక అంశాల అభివృద్ధిని తీవ్రంగా పరిశోధించాలన్నారు. ప్రాంతాల వారిగా భారత దేశంలోని వ్యవసాయ అహార వ్యవస్థలపై దృష్టి కేంద్రీకరించాలని శాస్త్రవేత్తలకు సూచించారు. వరి కోసం ఐదు మిలియన్ హెక్టార్ల విస్తీర్ణం తగ్గిం చాలని, అదే సమయంలో ఉ త్పత్తులను 10 మిలియన్ టన్నులు పెంచాలన్నారు. నత్రజని వినియోగ సామర్థ్యం, నీటి వినియోగ సామర్థ్యం, మెడోనోజెనిసిస్, ఫాస్పరస్ వినియోగ సామర్థ్యం పై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఐసీఏఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (క్రాప్ సైన్సెస్) డాక్టర్ డి.కే యాదవ మాట్లాడుతూ, వరి పరిశోధనలకు ఐసీఏఆర్ మంచి ప్రోత్సాహాన్ని అందజేస్తుందన్నారు. వరిలో జీనోమ్ ఎడిటింగ్ వంటివి భారతదేశంలో వరి పరిశోధనలకు ఊపు నిచ్చేవిగా ఉన్నాయన్నారు. 1996లో విత్తన చట్టం అమలులోకి వచ్చినప్పటినుంచి భారతదేశం 1500ల వరి రకాలను విడుదల చేసిందన్నారు. వ్యవసాయ ఎగుమతుల్లో 60శాతం బియ్యం నుంచి, విదేశీ ఖజానాగా రూ. 48వేల కోట్లు సంపాదించడం జరుగుతుందన్నారు. దేశంలో హైబ్రిడ్ వరి విస్తరించాల్సిన సమయం ఇది అన్నారు. హెర్బిసైడ్లను తట్టుకునే వరి రకాలు రావాలన్నారు. ఐఐఆర్ఆర్ డైరెక్టర్ డాక్టర్ రామన్ మీనాక్షి సుందరం మాట్లాడుతూ, 2024లో భారతదేశంలో వరి ఉత్పత్తులు. నూతన వంగడాలు, రైతులకు చేసిన మేళ్ల కు సంబందించిన నివేధికను వివరించారు. భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాల గురించి దిశానిర్దేశం చేశారు. వరి ఉత్పత్తులను పెంచడానికి దేశవ్యాప్తంగా అనేక కార్యక్రమాలను చేపడుతున్న సంస్థ రాజేంద్రనగర్ లోని జాతీయ వరి పరిశోధన సంస్థ అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య, ఆంధ్రప్రదేశ్ లో గల ఆచార్య ఎనీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ ఆర్ శారద జయలక్ష్మి దేవి, ప్రముఖ శాస్త్రవేత్తలు డాక్టర్ ఏకే సింగ్, డాక్టర్ ఎస్.కే ప్రధాన్, అజయ్ బలోటియా తదితరులు పాల్గొన్నారు.



## పహేల్గామ్ ఉగ్రదాడిలో మృతి చెందిన దానిని ఖండిస్తూ కుల మతాలకు అతీతంగా శాంతి ర్యాలీ, నిరసన

**ఆల్ కాలనీస్ ఫెడరేషన్ బి.జె.యమ్.సి.సభ్యులు నరేందర్ బాబు**

రాజేంద్ర నగర్,ఏప్రిల్ 27(ప్రభాత ఉదయం):పహేల్గామ్ ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించడం జరిగిందని ఆల్ కాలనీస్ ఫెడరేషన్ బి.జె.యమ్.సి.సభ్యులు నరేందర్ బాబు తెలిపారు.ఆదివారం ఆల్ కాలనీస్ ఫెడరేషన్ బి.జె.యమ్.సి.ఆధ్వర్యంలో శాంతి ర్యాలీలో పాల్గొన్న వివిధ కాలనీల నివాసితులకు ఆల్ కాలనీస్ ఫెడరేషన్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.పహల్గామ్ ఉగ్రవాద దాడులను ఖండిస్తూ మతాలకు అతీతంగా శాంతి ర్యాలీని,సన్‌సిటీలోని ఆర్మీ పబ్లిక్ స్కూల్ నుండి బండ్లగూడ జాగీర్‌లోని ఫార్మయిష్ హెూటల్ దగ్గర వున్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం వరకు జరిగింది.శాంతి,ఐక్యతకు మద్దతు ఇస్తూ సంఘీభావం,ఐక్యతను ప్రదర్శించిన కాలానివాసులు అందరికీ ధన్యవాదాలు తెలియచేస్తున్నాము.ఈ కార్యక్రమంలో ఆల్ కాలనీస్ ఫెడరేషన్ అడ్వైజర్ సుధాకర్ (ఎక్స్ ఆర్మీ ),ప్రెసిడెంట్ వినయ్ రెడ్డి,వైజ్ ప్రెసిడెంట్ నదీమ్,జనరల్ సెక్రటరీ నరేందర్ బాబు,ప్రమీల,వంశీ,రాధాకృష్ణ,వివిధ కాలనీల్ ప్రతినిధులు పాల్గొన్నారు.




ఎమ్మెల్యే జిఎంఆర్ తో కాంగ్రెస్ పార్టీలో చేరిన కొత్తకోట మండల బి ఆర్ ఎస్ నాయకులు

## పేదల అభ్యున్నతి కాంగ్రెస్ ఆశయం: ఎమ్మెల్యే జిఎంఆర్

**బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం రోజే బిఆర్ఎస్ పార్టీకి షాక్**

**కాంగ్రెస్ పార్టీలో చేరిన కనిమెట్ల గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు**

కొత్తకోట, ఏప్రిల్ 27 (ప్రభాత ఉదయం) పేదల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం అని దేవరకద్ర నియోజకవర్గ శాసనసభ్యులు గవినోళ్ల మధుసూదన్ రెడ్డి అన్నారు. ఆదివారం కొత్తకోట మండలం కనిమెట్ల గ్రామంలో బిఆర్ఎస్ పార్టీకి పెద్ద షాకే మిగిల్చిందని చెప్పుకోవచ్చు బిఆర్ఎస్ పార్టీకి చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం రోజు నే 120,మంది నాయకులు కార్యకర్తలు హైదరాబాద్ లోని ఎమ్మెల్యే జిఎంఆర్ నివాసంలో కాంగ్రెస్ పార్టీలో చేరి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అభివృద్ధి సంక్షేమ పథకాలు, దేవరకద్ర నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి నాయకత్వాన్ని మెచ్చి, ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ చేరిన వారిలో కావలి రమేష్ బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు, కృపాకర్ రెడ్డి బిఆర్ఎస్ గ్రామ మాజీ అధ్యక్షులు, వాకిటి పరశురాములు గ్రామ మత్స్యకార సంఘం అధ్యక్షులు, ఆకుల రమేష్ మాజీ వార్డ్ మెంబర్, గొల్ల మల్లన్న యాదవ సంఘం అధ్యక్షులు, మేడేటి శ్రీనివాసులు మిల్లర్ సంఘం అధ్యక్షులు, నర్మల ఆంజనేయులు ట్రాక్టర్ డ్రైవర్ సంఘ అధ్యక్షులు,ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బీచ్ పల్లి యాదవ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి కృష్ణారెడ్డి, శేఖర్ రెడ్డి, గుంత రమణ, కోటేశ్వర్ రెడ్డి, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.



పిడుగుపాటుకు ఇంటి పైకప్పు రంధ్రం పడిన దృశ్యం

## ఇంటిపై పడిన పిడుగు .. తప్పిన ప్రమాదం

గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 27 (ప్రభాత ఉదయం) జోగులాంబ గద్వాల జిల్లాలో ఆదివారం కురిసిన వర్షానికి బీభత్సం సృష్టించింది. మల్దకల్ మండలం మేకల సోంపల్లి గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం కురిసిన ఉరుములు మెరుపుల వర్షానికి రవి ప్రకాష్ ఇంటిపై పిడుగు పడటంతో వాటర్ ట్యాంక్ ధ్వంసం అయి గది లోపలికి రంధ్రం ఏర్పడింది. కుటుంబం ఆ గదిలో లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని రవి ప్రకాష్ తెలిపారు. బాధితులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



వరంగల్ సభకు కార్యకర్తలతో కలిసి వెళ్తున్న రాజేంద్రనగర్ డివిజన్ కార్పొరేటర్ పి అర్చన జయప్రకాష్




అత్తాపూర్ నుంచి వెళ్తున్న నాయకుల వాహనానికి జెండా ఊపుతున్న బీ ఆర్ ఎస్ సీనియర్ నాయకులు కొలన్ సుభాష్ రెడ్డి. చిత్రంలో వనం శ్రీరామ్ రెడ్డి, రావుల జంగయ్య, చెట్టిగారి నరేందర్, కొండమీది హరినాథ్ తదితరులు


## రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో వరంగల్ బహిరంగ సభకు వెళ్లిన నాయకులు

బుద్వేల్, ఏప్రిల్ 27(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి వందలాది మంది కార్యకర్తలతో వరంగల్ ఎల్కతుర్తిలో నిర్వహించిన బీఆర్ఎస్ బహిరంగ సభకు తరలివెళ్లడం జరిగిందని బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి తెలిపారు. మైలార్దేవుపల్లి లో ఆదివారం సభ కు వెళుతున్న బస్సుకు డివిజన్ అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్ తో కలసి జెండా ఊపి ప్రారంభించారు. అత్తాపూర్ డివిజన్ నుంచి కొలన్ సుబాష్రెడ్డి, వనం శ్రీరాం రెడ్డి, చెట్టిగారి నరేందర్, రావుల జంగయ్య ల ఆధ్వర్యంలో బయలు దేరి వెళ్లారు. రాజేంద్రనగర్ డివిజన్ కార్పొరేటర్ పి.అర్చన జయప్రకాశ్ కార్యకర్తల తో కలసి బీఆర్ఎస్ బహిరంగ సభకు వెళ్లారు.




వరంగల్ బీ ఆర్ ఎస్ సభ కు వెళ్తున్న వారితో రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి





వైద్య శిబిరం ప్రారంభిస్తున్న కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి

## రాందేవ్ ఆసుపత్రి సేవలు అద్భుతం

**కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు: శేరి సతీష్ రెడ్డి**

**మున్సిపల్ కార్మికులకు వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయం**

కూకట్‌పల్లి,ఏప్రిల్ 27 (ప్రభాత ఉదయం) కూకట్ పల్లి ప్రాంతంలో రోగులకు విశేష సేవ అందిస్తున్న రాందేవ్ ఆసుపత్రి సేవలు అద్భుతం అని కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి అన్నారు. ఆదివారం రాందేవ్ ఆసుపత్రిలో మున్సిపల్ కార్మికుల మెగా వైద్య శిబిరం కార్యక్రమంలో స్కానింగ్ విభాగాన్ని శేరి సతీష్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాందేవ్ ఆసుపత్రి రోగులకు సేవలు అందిస్తూనే సమాజానికి సేవలు అందిస్తున్న జర్నలిస్టులు, పోలీసులతో పాటు మున్సిపల్ కార్మికులకు ఉచిత వైద్య శిబిరం ద్వారా రోగాల నిర్ధారణ చేసి ఉచితంగా మందులు పంపిణీ చేయడం హర్షించదగ్గ పరిణామం అన్నారు. సమాజ హితానికి కృషి చేస్తున్న రాందేవ్ ఆసుపత్రి వైద్య సారధులు డాక్టర్ కమలాకర్ రావు, సీఈవో డాక్టర్ యోబు లతోపాటు వైద్య బృందాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రేటర్ హైదరాబాద్ కన్వీనర్ మేకల మైఖేల్, కెపిహెచ్బి డివిజన్ ప్రెసిడెంట్ తమ్మినేని ప్రవీణ్ కుమార్,కొమ్ము బాబు, రామకృష్ణారెడ్డి గిరి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



ప్రధాని నరేంద్ర మోడీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని పార్టీ నాయకులతో కలసి వీక్షిస్తున్న రాజ్య సభ సభ్యులు డాక్టర్ కె లక్ష్మణ్

## కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న పథకాలను ప్రజలలోకి తీసుకువెళ్లాలి: డాక్టర్ కె. లక్ష్మణ్

బుద్వేల్, ఏప్రిల్27(ప్రభాత ఉదయం) : కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వంలో చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలలోకి తీసుకువెళ్లడానికి ప్రతి బీజేపీ కార్యకర్త పనిచేయాలని రాజ్యసభ సభ్యులు, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె. లక్ష్మణ్ అన్నారు. ప్రధాని నరేంద్రమోడీ మన్ కీ బాత్ 121వ ఎపిసోడ్ ను రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని శివరాంపల్లి ప్రజాభవన్ లో రాజేంద్రనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు గుంజ బాబురావు ఆధ్యక్షతన బీజేపీ నాయకులు ఆదివారం సామూహికంగా తిలకించారు. ఈ కార్యక్రమం లో డాక్టర్ కె. లక్ష్మణ్ తో పాటు రంగారెడ్డి రూరల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పంతంగి రాజ్ భూ పాల్ గౌడ్ లు పాల్గొన్నారు. ప్రధాని నరేంద్రమోడీ చెప్పినట్లు జమ్ముకాశ్మీర్ పహల్గామ్ లో జరిగిన ఉగ్రదాడిని ప్రతి ఒక్కరు బండించాల్సిన అవసరం ఉందన్నారు. ఇది భాదాకరమైన విషయమన్నారు. బాదిత కుటుంబాలను కేంద్రం అదుకుంటుందన్నారు. ఈ దాడికి కారకులైన వారి పట్ల కేంద్రం కఠినంగా వ్యవహిరిస్తుందన్నారు. దేశంలోని 140 కోట్ల భారతీయులకు బీజేపీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జీ, మైలార్ దేవుపల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాసరెడ్డి, నాయకులు ప్రభాకర్ రెడ్డి, ఎం.కొమురయ్య, కాడెం సుదాకర్, పి.మల్లేశ్ యాదవ్, బొక్క బాల్ రెడ్డి, సత్యనారాయణ ముదిరాజ్, కోరని సదానంద్. ఎస్.విజయ్ కుమార్, జోగి రవి, వేముల మల్లేశ్, రాచూరి రాజశేఖర్, అడిగె జనార్ధన్, సులిగె వెంకటేశ్, కోరని క్రాంతి, పద్మావతి, ఉమా అల్లాల, అనురాధ, నవారు మురలీధర్ రెడ్డి , తదితరులు పాల్గన్నారు.



అయోధ్య వెళ్తున్న విద్యార్థులతో ఉద్యాన విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులు



అయోధ్యకు వెళ్తున్న క్రీడాకారుల బస్సుకు జెండా ఊపి ప్రారంభిస్తున్న శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ దండా రాజిరెడ్డి

## క్రీడా స్ఫూర్తితో జీవితంలో విజయాలు: డాక్టర్ దండ రాజిరెడ్డి

బుద్వేల్, ఏప్రిల్27 (ప్రభాత ఉదయం): క్రీడా స్ఫూర్తితో విద్యార్థులకు జీవితంలో ఒడిదుడుకులను తట్టుకునే శక్తి అలవాటు అవుతుందని, తద్వారా జీవితంలో విజయాలు సుసాధ్యమని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ దండ రాజిరెడ్డి అన్నారు. అయోధ్యలో మే 2వ తేదీ నుంచి 5వ తేదీ వరకు జరగనున్న 22వ అఖిల భారత అంతర వ్యవసాయ విశ్వవిద్యాలయాల క్రీడలు, ఆటల పోటీలకు ఉద్యాన విశ్వవిద్యాలయం నుంచి 40 మంది క్రీడా కారుల బృందం ఆదివారం బయలుదేరి వెళ్లింది. ఆ బృందానికి డాక్టర్ దండ రాజిరెడ్డి జెండా ఊపి సాగనంపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఉద్యాన విశ్వవిద్యాలయంలో క్రీడా ప్రాంగణాలు కచ్చితంగా ఉ ండేటట్లు చూస్తున్నామన్నారు. క్రీడల ద్వారా అలవాటయ్యే శారీరక, మానసిక ఉ త్సాహంతో చదువులో విద్యార్థులు రాణిస్తారని గుర్తు చేశారు. క్రీడలలో పాల్గొనడం ద్వారా గెలుపోటములను సమానంగా స్వీకరించే స్ఫూర్తి పెరుగుతుం దన్నారు. అది జీవితంలో చాలా ముఖ్యమని డాక్టర్ రాజిరెడ్డి తెలిపారు. విద్యార్థులు రోజు కొంత 'సమయాన్ని క్రీడలకు కేటాయించాలన్నారు. వర్సిటీ విద్యార్థి వ్యవహారాల డీన్ డాక్టర్ చీనా నాయక్ మాట్లాడుతూ, విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలలన్నింటిలో విద్యార్థులకు ఫిజికల్ అండ్ స్పోర్ట్స్ కు సంబందించిన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ భగవాన్, రాజేంద్రనగర్, మోజెర్ల, మల్యాల ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ లు డాక్టర్ పోతురాజు ప్రశాంత్, డాక్టర్ పిడిగెం సైదయ్య, డాక్టర్ వెంకటలక్ష్మీ, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సూర్యలా ప్రయోగాలు చేయడానికి చాలా ధైర్యం కావాలి



## విజయ్ దేవరకొండ

ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తూ.. భారత్‌పై దాడులకు పాల్పడుతున్న పాకిస్థాన్‌పై ఆ దేశ ప్రజలే తిరగబడే రోజులు రానున్నా యన్నారు కథానాయకుడు విజయ్ దేవరకొండ. కశ్మీర్ భారత్‌దే అని నినదించారు. ఆయన శనివారం రాత్రి హైదరాబాద్‌లో జరిగిన 'రెట్రో' చిత్ర విడుదల ముందస్తు వేడుకలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కథా నాయకుడు సూర్య... దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ కలయికలో రూపొందిన చిత్రమే 'రెట్రో'. పూజా హెగ్డే కథానాయిక. ఈ సినిమా సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ ద్వారా మే 1న తెలుగు ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే ప్రీరిలీజ్ వేడుకని నిర్వహించారు. ఈ సందర్భంగా హీరోలు విజయ్ దేవరకొండ, సూర్య పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు నివాళులు అర్పించారు.

అనంతరం విజయ్ దేవరకొండ మాట్లాడుతూ.. "నేను నటుణ్ని అవ్వాలనుకుంటున్న రోజుల్లో కచ్చితంగా కలవాలనుకున్న హీరో సూర్య. దానికోసం రకరకాల ప్రయత్నాలు చేశా గానీ కుదర్లేదు. అలాంటిది ఇన్నేళ్ల తర్వాత ఈ వేదికపై తనని ఇలా కలుసుకుని.. నా జ్ఞాపకాల్ని పంచుకోవడం నాకెంతో ప్రత్యేకం. సినిమాలు హిట్టవుతుంటాయి.. ఫ్లాప్ అవుతుంటాయి. కానీ, తెరపై సూర్య నటన చూసినప్పుడల్లా.. అది అందరిలో ఓ స్ఫూర్తిని నింపుతుంటుంది. సూర్యలా విభిన్నమైన జానర్లు చేయడానికి.. ప్రయోగాత్మక పాత్రలు పోషించడానికి చాలా ధైర్యం కావాలి. ఆయన మే 1న 'రెట్రో'తో కచ్చితంగా ఓ అద్భుతమైన షో చూపించనున్నారు" అన్నారు.

కథానాయకుడు సూర్య మాట్లాడుతూ.. "రెట్రో.. పూర్తిగా కార్తీక్ సుబ్బరాజ్ సినిమా. ఇదొక వినూత్నమైన రీతిలో ప్రేక్షకుల్ని అలరిస్తుంది. కచ్చితంగా ఈ సినిమా ఈసారి అందర్నీ సంతృప్తి పరుస్తుందని నమ్ముతున్నా. నా సినిమాతో పాటుగా ఆ రోజే విడుదల కానున్న నాని 'హిట్ 3' చిత్రం కూడా విజయవంతం కావాలని కోరుకుంటున్నా" అన్నారు.

# హింసే నన్ను ఇష్టపడుతోంది!

విజయవంతమైన 'కేజీఎఫ్' సిరీస్ చిత్రాలతో పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంది నటి శ్రీనిధి శెట్టి. ఇప్పుడామె 'హిట్ : ది థర్డ్ కేస్'తో తెలుగులో తొలి అడుగు వేసేందుకు సిద్ధమైంది. ఆమె.. కథానాయకుడు నాని జంటగా నటించిన ఈ బహుభాషా చిత్రాన్ని శైలేష్ కొలను తెరకెక్కించారు. ఇది మే 1న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం ఈ చిత్ర విశేషాల్ని విలేకర్లతో పంచుకుంది నటి శ్రీనిధి శెట్టి.

"నేను కథ విన్నప్పుడే ఇది చాలా హింసతో నిండి ఉన్న యాక్షన్ చిత్రమని అర్థమైంది. నిజానికి ఈ కథకు అంత యాక్షన్ అవసరముంది. ఈ జానరే అలాంటిది. అందుకే దీనికి 'ఏ' సర్టిఫికెట్ వస్తుందని నాకు అప్పుడే అర్థమైపోయింది. దీని గురించి నానితో నేను సరదాగా ఓ మాట అన్నా. మీకు 'ఏ' సర్టిఫికెట్ అందుకోవడానికి 16ఏళ్లు పట్టింది. నేను నా నాలుగో చిత్రంతోనే దాన్ని అందుకున్నా అని సరదాగా చెప్పా. దీని వల్ల ఈసారికి మా సినిమాని 18ఏళ్ల లోపు పిల్లలు చూసే అవకాశం లేకపోయింది. కానీ, మిగతా ప్రేక్షకులంతా దీన్ని చూసి తప్పక ఆదరిస్తారని నమ్ముతున్నా".

"నేను సున్నిత మనస్కురాలినే. కాకపోతే 'కేజీఎఫ్'లో యశ్ చెప్పినట్లు 'వైలెన్స్ ఐ డోంట్ లైక్ ఇట్.. ఐ అవాయిడ్. బట్ వైలెన్స్ లైక్స్ మీ. ఐ డోంట్ అవాయిడ్' (నవ్వుతూ). అందుకే నేను ఏం చేయలేకపోతున్నా. ముందే చెప్పినట్లు ఇది తొలి సీన్ నుంచే హింసాత్మకంగా చిత్రమేమీ కాదు. ఎక్కడ అవసరమో అక్కడ యాక్షన్ కనిపిస్తుంటుంది. 'కేజీఎఫ్' చిత్రాలకు 'హిట్ 3' పూర్తి భిన్నంగా ఉంటుంది"."అందరూ అనుకున్నట్లు ఇది పూర్తిగా హింసతో నిండిన యాక్షన్ చిత్రమేమీ కాదు. ఇందులో క్రైమ్, ఇన్వెస్టిగేషన్, డ్రామా, యాక్షన్, ప్రేమ.. అన్నీ ఉంటాయి. యాక్షన్ అన్నది ఎప్పుడు అవసరం ఉంటుందో అప్పుడు బయటకొస్తుంటుంది. దీంట్లో అర్జున్ సర్కార్ ఎంత వైలెంట్‌గా, ఫ్రస్టేటెడ్‌గా ఉంటాడో టీజర్, ట్రైలర్లతో అందరికీ అర్థమై ఉంటుంది. అతన్ని శాంతంగా ఉంచే ప్రేయసిగా మృదుల పాత్రలో నేను కనిపిస్తా. ఈ సినిమాలో అర్జున్, మృదుల మాట తప్పితే ఇంకెవరి మాట లెక్క చేయడు. కథలో అవసరమైనప్పుడల్లా నా పాత్ర కనిపిస్తుంటుంది. దీంట్లో నా పాత్రలో మరో ఆసక్తికర కోణం కూడా దాగి ఉంటుంది. అదేంటన్నది సినిమా చూసి తెలుసుకోవాలి".

నటి శ్రుతిహాసన్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విషయాలను పంచుకున్నారు. తల్లిదండ్రుల విడాకులు, కెరీర్ ఆరంభంలో ఎదుర్కొన్న అవమానాలతోపాటు రిలేషన్‌షిప్ గురించీ మాట్లాడారు. తన గత ప్రేమ కథలను బహిర్గతం చేశారు. సరైన ప్రేమను పొందడంలో తాను ఎన్నోసార్లు విఫలమయ్యానని చెప్పారు. "జీవితంలో ఇలాంటి పని ఎందుకు చేశానా.. అని బాధపడిన సందర్భాలు పెద్దగా ఏమీ లేవు.

# ఎన్నో బాయ్‌ఫ్రెండ్ అని అడిగేవారు

కానీ, నాకెంతో ఇష్టమైన వారిని కొన్నిసార్లు బాధపెట్టాను. అనుకోకుండా అది జరిగినప్పటికీ.. అలా చేయకుండా ఉండాల్సిందనే భావన ఎప్పటికీ ఉంటుంది. జీవితాంతం వారికి క్షమాపణలు చెబుతూనే ఉంటా. జీవితంలో ప్రతి ఒక్కరికీ ఒక విఫల ప్రేమగాథ ఉంటుంది. మాజీ భాగస్వామి వల్ల మనం ఎన్నో విషయాలు అర్థం చేసుకుంటాం. నాక్కూడా అలాంటి బ్రేకప్ స్టోరీలు ఉన్నాయి. బ్రేకప్ అయ్యాక దాని గురించి ఎక్కువగా ఆలోచించకుండా ఉంటా. నా లవ్‌స్టోరీలను ఉద్దేశించి చాలామంది మాట్లాడుతుంటారు. 'ఇతడు ఎన్నో బాయ్‌ఫ్రెండ్?' అని అడుగుతుంటారు. వాళ్లకు అర్థం కాని విషయం ఏమిటంటే.. వారి దృష్టిలో అది కేవలం నంబర్ మాత్రమే.. కానీ, నాకు అలా కాదు. నేను కోరుకున్న ప్రేమను పొందడంలో అన్నిసార్లు విఫలమవుతున్నానని అర్థం. అది నన్ను బాధ పెడుతుంది. ఎందుకంటే నేనూ మనిషినే కదా" అని శ్రుతి హాసన్ చెప్పారు.







# 'శుభం' మూవీ ట్రైలర్ విడుదల

ట్రా లా లా మూవింగ్ పిక్చర్స్ పతాకంపై నటి–నిర్మాత సమంత నిర్మించిన తొలి చిత్రం 'శుభం'. ఈ చిత్రానికి ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వం వహించారు. ఈ మూవీని మే 9న విడుదల చేయబోతోన్నారు. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన పోస్టర్లు, టీజర్ ఇలా అన్నీ కూడా ఇంట్రెస్ట్‌ను క్రియేట్ చేశాయి. ఇక సినిమా రిలీజ్ డేట్ దగ్గర పడుతున్న తరుణంలో ఆదివారం (ఏప్రిల్ 27) నాడు శుభం చిత్రం నుంచి ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. శుభం ట్రైలర్‌ను గమనిస్తే.. ఊర్లోని మహిళలంతా కూడా సీరియల్‌ను చూస్తూ వింతగా ప్రవర్తిస్తుంటారు. దెయ్యం పట్టినట్టుగా మహిళలు ప్రవర్తిస్తుంటే.. వారి నుంచి తప్పించుకునేందుకు ఊర్లో పురుషులంతా కూడా అష్టకష్టాలు పడుతుంటారు. అలాంటి తరుణంలో మాతాజీగా సమంత స్పెషల్ అప్పియరెన్స్ ఇచ్చి ట్రైలర్ మీద మరింత ఇంట్రెస్ట్ కలిగించేలా చేశారు. శుభం ట్రైలర్‌ను చూస్తే ఈ చిత్రంలో హాస్యం, హర్రర్, ఉత్కంఠ, ఎమోషన్స్ ఇలా అన్ని రకాల అంశాల్ని జోడించినట్టుగా కనిపిస్తోంది. శుభం మే 9న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. వివేక్ సాగర్ బీజీఎం స్కోర్, క్లింటన్ సెరెజో సంగీతం ప్రధాన ఆకర్షణ కానుందని తెలుస్తోంది.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608